## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూ.., కిలోల్లో... టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 45, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 35, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 3-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## ఎల్లమ్మకు లక్ష పుష్పార్చన



ఆలయంలో పూజలు చేస్తున్న రెయిన్ బో ఆస్పత్రి చైర్మన్ రమేశ్ సతీమణి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో పాటు రేయిన్‌బో ఆస్పత్రి చైర్మన్ రమేశ్ సతీమణి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం గర్భగుడిలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ పండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల్లో ఆలయ అధికారులు, అమీర్‌పేట కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీఆర్ఎస్ నేతలు హనుమంత్‌రావు, బల్‌రాం, వనం శ్రీనివాస్, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల సమస్యలను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు డా.ధర్మతేజ, డా.పారశురామ్ మాట్లాడుతూ.. గురువారం ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి రాకపై హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాండయ్య, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్, రామకృష్ణారెడ్డి, విజేందర్ రెడ్డి పాల్గొన్నారు.


## బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి

మాణికేశ్వర్‌నగర్ బస్తీలో నాయకుల పర్యటన



లాలాపేట: భారీ వర్షాల నేపథ్యంలో తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్ బస్తీలో మంగళవారం జలమండలి అధికారులతో కలసి బీఆర్ఎస్ నాయకులు, మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పర్యటించారు. మాణికేశ్వర్‌నగర్ వాసులు ఇటీవలే ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలసి మాణికేశ్వర్‌నగర్‌లో భారీ వర్షాలతో నాలాలు, మ్యాన్‌హోళ్లు పొంగి ఇళ్లలోకి వరద నీరు ప్రవహిస్తుందన్నారు. దీంతో స్థానిక ప్రజల ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని పద్మారావుకు దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు పద్మారావుగౌడ్ ఆదేశాలతో తార్నాక జలమండలి మేనేజర్ వినయన్ సిబ్బందితో వెళ్లి నివారణ చర్యలు చేపట్టారు. మ్యాన్‌హోళ్ల నుంచి పూడిక తీశారు. నాలాలను శుభ్రం చేశారు. పాతకాలం నాటి డ్రైనేజీ లైన్ వలన తరచుగా సమస్య వస్తుందని కొత్తలైన్‌కు ఎమ్మెల్యే ద్వారా మంజూరు లభించడంపై బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు ఆలకుంట హరి, మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ఓర్సు కృష్ణ, బాల కృష్ణగౌడ్, వరికుప్పల పరమేశ్, వేముల కృష్ణ, బోదాసు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## వృద్ధుడి అదృశ్యం



ఎల్లయ్య

చిలకలగూడ: మతిస్థిమితం కోల్పోయిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలగూడ దూద్‌బావికి చెందిన ఎల్లయ్య (60) కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనెల 17న మధ్యాహ్నం 1 గంటలకు బయటకు వెళ్లిన ఎల్లయ్య తిరిగి ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కుమార్తె స్వరూప మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

## నిర్లక్ష్యానికి తప్పదు

# భారీ మూల్యం

### ప్రమాదం అంచున మ్యాన్‌హోల్స్, పట్టించుకోని అధికారులు

కంటోన్మెంట్: చిన్నపాటికి వర్షానికే చిద్రమవుతున్న రోడ్లు.. వరద ప్రవాహానికి తట్టుకోలేక ఎక్కడికక్కడే నోళ్లు తెరుస్తున్న మ్యాన్‌హోల్స్. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు. అయినా అధికార యంత్రాంగంలో కదలిక లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేని దైన్యం. దీంతో స్థానికులే తమకు తోచిన రీతిలో సూచికలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా పదుల సంఖ్యలో మ్యాన్‌హోల్స్ ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. తక్షణమే అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**వరదొస్తే మునకే..**

రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న బోల్టన్ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్. ఓ వైపు టివోలీ ఎక్స్‌ట్రీమ్, టివోలీ గార్డెన్స్ మరో వైపు అక్షర వాగ్దేవీ, బోల్టన్ స్కూల్స్ ఉన్నాయి. నిత్యం వందలాది స్కూలు వాహనాలు, ఆటోలు, కార్లు నడిచే మార్గం. చిన్నపాటి వర్షానికే చెరువును తలపించేలా రోడ్డుపై నీరు నిలుస్తుంది. వరద నీటిలో మ్యాన్‌హోల్స్ ఎక్కడున్నాయో కూడా కూడా తెలియని దుస్థితి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండగా, తాజాగా మరింత ప్రమాదకరంగా మారింది. వంద మీటర్ల దూరంలోనే పికెట్ నాలాకు అనుసంధానం చేస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశముంది. అయినప్పటికీ కంటోన్మెంట్ బోర్డు అధికారులు అలసత్వం వహిస్తూ ఉండటం దారుణం. స్థానికులు ఓ కర్రకు ఎర్రని క్లాత్‌తో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



బోల్టన్ రోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్

**హరిత హారం మొక్క కాదు..**

డైమండ్ పాయింట్ చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ప్రతీరోజు పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్థానిక దుకాణదారు ఒకరు తన షాపు ముందు ఉన్న పూల కుండీని తీసుకొచ్చి రోడ్డుపై పెట్టారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులకు సూచికలా మారింది. దీంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా బోర్డు అధికారులు మాత్రం స్పందించడం లేదు.



**పట్టు జారితే అంతే సంగతి**



కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని సంగీత్- రైల్ నిలయం ప్రధాన రహదారిపై ఉన్న దుస్థితి ఇది. ఈ మార్గంలోని భారీ డ్రైనేజీ లైన్‌పై ఉన్న మ్యాన్‌హోల్ రోడ్డుపై కుంగిపోయింది. ఈ మార్గంలో లారీలు, బస్సులతో పాటు ఇతరత్రా భారీ వాహనాలు వెళ్తుంటాయి. పొరపాటున ఈ మ్యాన్‌హోల్‌పై నుంచి ఏదైనా భారీ వాహనం వెళితే రోడ్డు కుంగిపోయే ప్రమాదముంది. దీంతో స్థానికులు కుంగిన మ్యాన్‌హోల్ గుంతకు అడ్డుగా కర్రను అమర్చి, దానిపై బుట్టలు ఏర్పాటు చేశారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే భారీ ప్రమాదం తప్పకపోవచ్చు.

## వైద్యం అందించడంలో అశ్రద్ధ వద్దు

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం అందించే విషయంలో అశ్రద్ధ చూపొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4.62 లక్షల విలువైన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం ఎంతో ఖరీదుగా మారిందని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక మందికి తాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించామన్నారు. మెరుగైన వైద్యం పొందిన తర్వాత వారు సాధారణ స్థితికి చేరుకున్నారని వివరించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారికి ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని చెప్పారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నాయకులు శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, నాగులు, అశోక్‌యాదవ్, లక్ష్మీపతి, మహేశ్ యాదవ్, గోపీలాల్‌చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, సత్యనారాయణ, అబ్బాస్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నగర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

సనత్‌నగర్: అంతర్జాతీయ స్థాయిలో సైతం సత్తా చాటి హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకురావాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. సనత్‌నగర్‌లోని వాల్మీకి వ్యాయామశాలకు చెందిన రవిసింగ్, ప్రియాంక పట్నాయక్‌లు పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 2 నుంచి 7 వరకు కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో రవిసింగ్ 93 కేజీల కేటగిరిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించగా, 52 కేజీల విభాగంలో ప్రియాంక పట్నాయక్ సిల్వర్ మెడల్‌ను గెలుచుకుంది. వీరిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అనేక పోటీల్లో పాల్గొని మరిన్ని మెడల్స్‌ను సాధించాలన్నారు. తన ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. తమ వ్యాయామశాల అభివృద్ధికి ఎంతో సహకారాన్ని అందించారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



రవిసింగ్, ప్రియాంక పట్నాయక్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

## రీ మోడలింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి



మైత్రివనం పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్

**కమిషనర్ కర్ణన్ ఆదేశం**

అమీర్‌పేట: అమీర్‌పేట మైత్రివనంలో ఉన్న ప్రస్తుత డ్రైన్ రీ మోడలింగ్ (నాలా పునర్నిర్మాణం)కు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సాంకేతిక కన్సల్టెంట్ లతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్‌కు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వర్షపు వరదనీరు ప్రవాహంలో ఏర్పడుతున్న ప్రతిబంధకాలు, సమస్యలను అధిగమించే పరిష్కార మార్గాలను సంబంధిత అధికారులు, కన్సల్టెంట్‌లతో చర్చించారు. ప్రజాభద్రత, ఆస్తుల పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని వరదనీటి ప్రవాహం సజావుగా సాగేలా సమర్థ వరద నిర్వహణకు వీలుగా నాలాను పునర్నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రైవేట్ సంస్థ ద్వారా చేపట్టిన సర్వేపై కమిషనర్ ఆరా తీశారు. సర్వేను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

## చిలకలగూడ జంక్షన్ బ్యూటిఫికేషన్‌కు కసరత్తు



చిలకలగూడ జంక్షన్‌ను సందర్శించిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు

సికింద్రాబాద్: రైల్వేస్టేషన్ ఒలిఫెంటా వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలి బ్యూటిఫికేషన్ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ముషీరాబాద్, తార్నాక, చిలకలగూడ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ల దారులను కలిపే భారీ కూడలి ఇది. ఈ కూడలిని ఆధునీకరించేందుకు ఇటీవల జీహెచ్ఎంసీ కన్జర్వేన్సీ సమావేశంలో నిర్ణయించి ఇందుకోసం రూ.95 లక్షలు కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు మంగళవారం చిలకలగూడ కూడలిని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు సందర్శించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు సుబ్రహ్మణ్యం, నరేంద్ర, గోపాలపురం ట్రాఫిక్ సీఐ భాస్కర్, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

అమీర్‌పేట: వరదల కారణంగా వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధులపై మరింత అప్రమత్తంగా ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వైద్యులకు సూచించారు. మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎమ్ఓ, ఇతర వైద్యుల వెళ్లి ఎమ్మెల్యేను కలసి డీజిల్ జనరేటర్ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని చెప్పారు. ప్రధానంగా గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమీపంలో ప్రసవ తేదీ (ఈడీడీ) ఉన్న కేసులను తప్పనిసరిగా ఆస్పత్రిలో చేర్చాలని స్పష్టం చేశారు. జనరేటర్‌ను అందుబాటులోకి తెచ్చే విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రౌఫ్, ఆర్ఎంఓ వినాయకరావు, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 21న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

పంజగుట్ట: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం యూని ఎక్స్‌పర్ట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన రాజ్‌భవన్ రోడ్డు, సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్స్ హెడ్ ఉమ తెలిపారు.

## మార్కెట్లోకి బ్రూసియా' కలుపు మందు

**మొక్కజొన్న పంట కోసం..**



మార్కెట్లోకి 'బ్రూసియా'ను విడుదల చేస్తున్న యూపీఎల్ ఎస్ఏఎస్ లిమిటెడ్ ప్రతినిధులు..

సనత్‌నగర్: వ్యవసాయ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామిగా ఉన్న యూపీఎల్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సొల్యూషన్స్ లిమిటెడ్ (యూపీఎల్ ఎస్ఏఎస్ లిమిటెడ్) మొక్కజొన్న పంట కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేసిన తాజా కలుపు మందు 'బ్రూసియా'ను బేగంపేట బృందావన్‌కాలనీలోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూపీఎల్ ఎస్ఏఎస్ లిమిటెడ్ సౌత్ అండ్ ఈస్ట్ ఇండియా బిజినెస్ హెడ్ జగదీష్ యెర్నేని మాట్లాడుతూ భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణలో మొక్కజొన్న పంట ప్రాధాన్యతను వివరించారు. అలాగే మొక్కజొన్న ఈ ప్రాంతానికి అత్యంత ముఖ్యమైన పంట అని తెలిపారు. బ్రూసియా వంటి వినూత్న పరిష్కారాలు రైతుల ఉత్పాదకతను, లాభదాయకతను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఇండియా ఫీల్డ్ మార్కెటింగ్ హెడ్ ప్రతాప్ రంకంబ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించి, బ్రూసియా పంటకు సరైన పరిష్కారమన్నారు. ఇది రైతులకు నమ్మకమైన, సమర్థవంతమైన కలుపు నియంత్రణను అందిస్తుందని తెలిపారు. సౌత్ ఇండియా ఫీల్డ్ మార్కెటింగ్ హెడ్ సంగమేశ్వర్ మాట్లాడుతూ బ్రూసియా ప్రత్యేకతలు, దాని ప్రభావం, మొక్కజొన్న పంటలో దాని ప్రాముఖ్యతను వివరించారు. ఇటువంటి అద్భుతమైన ఉత్పత్తిని రైతులకు అందించగలగడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిజినెస్ హెడ్ బ్రహ్మారెడ్డి మార్కెటింగ్ హెడ్ కొల్లి అశోక్, నార్త్ తెలంగాణ బిజినెస్ మేనేజర్ రంజిత్‌రెడ్డి, సౌత్ తెలంగాణ బిజినెస్ మేనేజర్ వాసుదేవరెడ్డి, సౌత్ ఎసెన్షియల్ బిజినెస్ మేనేజర్ చాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి



క్రీడలు ప్రారంభిస్తున్న కల్నల్ షాజీని

రసూల్‌పురా: క్రీడలు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను, గెలుపు దృక్పథాన్ని పెంపొందిస్తాయని ఏటీసీ సెంటర్ కల్నల్ షాజీని అన్నారు. పికెట్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 54వ జాతీయ క్రీడోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటీసీ సెంటర్ కల్నల్ కేజీ. షాజీని, కేవీఎస్ రీజినల్ ఆఫీసర్ పి. అనురాధ హాజరై బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ షాజీని మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ రూపిందర్ సింగ్ మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, జట్టు కృషితో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. ఐదు రోజుల పాటు క్రీడోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌తో అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీజీటీ విజయభాస్కర్‌రెడ్డి, పీఎస్. నాగలక్ష్మి, వర్జీనియా సుందర్, అస్తా తివారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో మంగళవారం అఖిల భారత ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్తులు హాజరై కాసాని జ్ఞానేశ్వర్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు, వివిధ వర్గాల ప్రజల మధ్య భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెద్ద ఎత్తున నోట్ పుస్తకాలతో పంపిణీ చేశారు. అదే విధంగా పెద్ద మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాన, వైద్య శిబిరాన్ని నిర్వహించి ఎంతో మంది పేదలకు ఉచితంగా వైద్య ఆరోగ్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరీ శంకర్, కాసాని వీరేష్, కాసాని తనయుడు సాయిలతో పాటు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు దొడ్ల సదానంద్, ప్రకాష్, శ్రీనివాస్, సురేందర్, శ్రీకాంత్, వెంకటేష్, మన్మోహన్, దేవుడు శ్రీనివాస్, ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

## పీహెచ్‌డీ పట్టా అందుకున్న తైక్వాండో క్రీడాకారుడు



ఇస్రో చైర్మన్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న బాబులాల్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం మంగళవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యాతిథిగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణ్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి గోల్డ్ మెడల్స్, పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారుడు జె.బాబులాల్ ఇస్రో చైర్మన్ డా. నారాయణన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో బాబులాల్ తైక్వాండో పోటీ అంశంపై పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేశాడు.



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శంకర్

**పీహెచ్‌డీ పట్టా అందుకున్న పశువుల కాపరి శంకర్**

లాలాపేట: పాలమూరు జిల్లా అమరచింత గ్రామానికి చెందిన ఆర్. యస్ శంకర్ బాల్యం పశువుల కాపరిగా ప్రారంభమైంది. చదువుపై మక్కువతో వామపక్ష సంఘాల ద్వారా చైతన్యంతో నేడు ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత చదువులను చదువుకున్నాడు. అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఇస్రో చైర్మన్ నారాయణ్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తన అత్యున్నతమైన పీహెచ్‌డీ డిగ్రీని సాధించడానికి తనలో చైతన్యం నింపిన కమ్యూనిస్టు నాయకులకు ఈ పట్టా అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు.

# మరోసారి రెచ్చిపోయిన సైబర్ మోసగాళ్లు..

- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట కుచ్చుటోపీ
- ఒకే రోజు ఏడు కేసుల్లో రూ.9,50,000లకు టోకరా
- లబోదిబోమంటున్న బాధితులు

సనత్‌నగర్: తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు అంటూ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసగాళ్లు అందినకాడికి దోచుకున్నారు. ఒక్క రోజే ఏడు కేసులకు సంబంధించి రూ.9,50,000ల మేర దోపిడీ చేసి నలుగురు అమాయకులకు కుచ్చుటోపీ పెట్టారు. స్టాక్ కొనుగోలు చేస్తే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు పొందవచ్చనే ఆశ వారి కొంప ముంచింది. ఒకవైపు ఆన్‌లైన్ మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న పదే పదే బాధితులు మోసపోతూనే ఉన్నారు. ఒక కేసులో అయితే ఒక్కరే మూడుసార్లు పెట్టుబడి మొత్తాలను పంపించి రూ.3,89,000ల కోల్పోవడం గమనార్హం. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆయా కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

**రెండు ఘటనల్లో ఒకే బాధితుడు రూ.2,78,000లు**

సనత్‌నగర్‌కు చెందిన సురేష్ (38) ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తుంటాడు. ఈ నెల 15న సాయంత్రం 6.51 గంటలకు తన ఫోన్ వాట్సాప్‌కు ఒక యూఆర్ఎల్ లింక్ సందేశం వచ్చింది. దానిని తెరిచి చూడగా కొంత మొత్తాన్ని పెట్టుబడి పెడితే అధిక లాభాలను పొందవచ్చనే సమాచారం ఆ లింక్‌లో ఉంది. దీంతో దానిని నమ్మిన సురేష్ యూజర్ ఐడీ, పాస్ట్‌వర్డ్‌ను సృష్టించి కొన్ని స్టాక్‌ల కొనుగోలు నిమిత్తం రూ.1,39,000ల మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాడు. ఈ మొత్తాన్ని యూపీఐ ద్వారా పంపించాడు. ఇదిలా ఉండగా మరో 14 నిమిషాలకు అంటే రాత్రి 7.14 గంటలకు మరో యూఆర్ఎల్ లింక్ వచ్చింది. ఆ వెబ్‌సైట్‌లో కొన్ని స్టాక్‌లు ఉన్నాయని, దానిని నమ్మి తన యూజర్ ఐడీ, పాస్ట్‌వర్డ్ క్రియేట్ చేసి స్టాక్‌లను నేరుగా కొనుగోలు చేసి, యూఆర్ఎల్ వెబ్‌సైట్‌లో రూ.1,39,000లను మళ్లీ పెట్టుబడి పెట్టాడు. రెండు వెబ్‌సైట్లలోనూ నగదు బదిలీ చేసిన వెంటనే వాటిని బ్లాక్ చేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు మంగళవారం వేర్వేరుగా సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు రెండు కేసులను నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో బాధితురాలు రూ.1,35,000..**

సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలో నివాసం ఉండే సౌమ్య (33) టెలిగ్రామ్‌కు ఈ నెల 4న రాత్రి 7.26 గంటల సమయంలో ఒక యూఆర్ఎల్ లింక్ వచ్చింది. ఆ సైట్‌ను తెరిచిచూడగా ఆమెను స్టాక్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. ఆమె వారిని నమ్మి కొన్ని స్టాక్‌లను కొనుగోలు చేసి రూ.1,35,000ల మొత్తాన్ని పెట్టుబడి పెట్టారు. కొంతకాలం తర్వాత సదరు వెబ్‌సైట్, యూజర్ ఐడీ, పాస్ట్‌వర్డ్‌ను బ్లాక్ చేశారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకొని బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఇంకో బాధితురాలు రూ.1,48,000..**

సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీకి చెందిన దీపిక (33)కు ఈ నెల 16న సాయంత్రం 6.06 గంటలకు టెలిగ్రామ్‌లో వచ్చిన యూఆర్ఎల్ లింక్ ఆధారంగా తక్కువ పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మి రూ.1,48,000ల మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టింది. కొంతసమయం తర్వాత వారి వెబ్‌సైట్, ఆమె యూజర్ ఐడీ, పాస్ట్‌వర్డ్‌ను కూడా బ్లాక్ చేశారు. వెంటనే కంపెనీకి ఫోన్ చేసినా స్పందించలేదు. అది మోసమని గ్రహించి మొత్తం రూ.1,48,000 కోల్పోయానంటూ బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**మరో మూడు ఘటనల్లో రూ.3,89,000లు..**

సనత్‌నగర్‌కు చెందిన నిఖిల్ (27) ఫోన్ వాట్సాప్‌కు ఈ నెల 6న మధ్యాహ్నం 2.03 గంటలకు వచ్చిన వెబ్‌లింక్‌ను ఓపెన్ చూసి చూడగా, స్టాక్‌లను కొనుగోలు చేస్తే పెద్ద మొత్తంలో ఆదాయం వస్తోందని సూచించారు. దానిని నమ్మిన నిఖిల్ కొన్ని స్టాక్‌ల కొనుగోలు నిమిత్తం రూ.1,39,000 బదిలీ చేశాడు. ఇది జరిగిన గంట తర్వాత మధ్యాహ్నం 3.03 గంటలకు వచ్చిన మరో లింక్‌కు కూడా ఆకర్షితుడై రూ.1,20,002ల మొత్తాన్ని పెట్టుబడి పెట్టాడు. ఇది జరిగిన మరో ఐదు నిమిషాల తర్వాత మధ్యాహ్నం 3.08 గంటలకు మరో లింక్ రాగా స్టాక్‌ల కొనుగోలు నిమిత్తం మరో రూ.1,30,002 మొత్తాన్ని పెట్టుబడి పెట్టారు. అలా వరుసగా మూడుసార్లు పెట్టుబడి మొత్తాన్ని రూ.3,89,000ల పంపించాడు. కొద్దిసేపటి తర్వాత సదరు వెబ్‌సైట్లు బ్లాక్ చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించి సనత్‌నగర్ పోలీసులకు మూడు కేసులకు సంబంధించి ఫిర్యాదులు అందించారు. దీంతో నిఖిల్ ఫిర్యాదుతో సనత్‌నగర్ పోలీసులు మూడు కేసులను నమోదు చేశారు.